వారం రోజులుగా సొరంగంలోనే

డెహ్రాడూన్, నవంబర్ 19: ఉత్తరాఖండ్‌లోని ఉత్తర్‌కాశీ సొరంగంలో చిక్కుకుపోయిన కార్మికులను రక్షించడానికి రక్షణ బృందాలు చేస్తున్న తీవ్ర ప్రయత్నాలు ఇంకా ఫలించలేదు. దీంతో వారం రోజులుగా లోపల చిక్కుకుపోయిన కార్మికుల ఆరోగ్యంపై ఆందోళన వ్యక్తమవుతున్నది. సొరంగం నిర్మించిన కొండ పైనుంచి నిలువుగా రంధ్రం చేయడానికి అధికారులు అదివారం ప్రయత్నాలు ప్రారంభించారు. ఇదే సమయంలో కార్మికులను రక్షించడానికి అయిదు ప్రత్యామ్నాయ ప్రణాళికలను అమలు చేసేందుకు ప్రధాని కార్యాలయ అధికారుల బృందం, నిపుణులు ప్రయత్నిస్తున్నారు.

'రైల్వే కంటే విమాన టికెట్ల ధరలే నయం!'

కోల్‌కతా, నవంబర్ 19: రైల్వే చార్జీలు, ప్రయాణికుల భద్రత విషయంలో పశ్చిమబెంగాల్ సీఎం, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేశారు. రైలు టికెట్ల విషయంలో తీసుకొచ్చిన 'డైనమిక్ ప్రైసింగ్' విధానాన్ని వెనక్కు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రయాణికుల భద్రతపై మరింత దృష్టి పెట్టాలని ఆదివారం ఎక్స్ పోస్టులో సూచించారు. ఒక్కోసారి విమానాల టికెట్ల కంటే రైలు టికెట్ల ధరలు అధికంగా ఉంటున్నాయని మమత పేర్కొన్నారు. తాను రైల్వే మంత్రిగా ఉన్న సమయంలో ప్రవేశపెట్టిన రైళ్లు ఒకదానికొకటి ఢీకొట్టకుండా నియంత్రించే పరికరాలు, ఇతర చర్యలను ఎందుకు ఉపయోగించడం లేదని ప్రశ్నించారు.

బియ్యం ఎగుమతులపై నిషేధం పొడిగింపు!

న్యూఢిల్లీ: బియ్యం ఎగుమతులపై నిషేధాన్ని కేంద్ర ప్రభుత్వం వచ్చే ఏడాదికి పొడిగించే అవకాశం ఉన్నదని బ్లూమ్‌బర్గ్ నివేదిక పేర్కొన్నది. దేశీయంగా ధరలు అధికంగా ఉన్నన్ని రోజులు.. ఈ నియంత్రణలు కూడా కొనసాగే అవకాశం ఉన్నదని ఆర్థికవేత్త సోనాల్ వర్మ అభిప్రాయపడ్డారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత ధరలు దిగిరాకుంటే.. ఈ నియంత్రణ చర్యలను మరింత పొడిగించే అవకాశం ఉన్నదన్నారు. ప్రపంచంలో బియ్యం ఎగుమతుల్లో అగ్రస్థానంలో ఉన్న భారత్.. దేశంలో బియ్యం ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో ఎగుమతులపై నిషేధం విధించాల్సి వచ్చింది.

ఇంఫాల్ ఎయిర్‌పోర్టు వద్ద యూఎఫ్‌వో!

- నిలిచిన విమాన సర్వీసులు

ఇంఫాల్, నవంబర్ 19: ఇంఫాల్ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద గగనతలంలో యూఎఫ్‌వో(అన్‌ఐడెంటిఫైడ్ ఫ్లయింగ్ ఆబ్జెక్ట్(గుర్తుతెలియని ఎగిరే వస్తువు)) కలకలం రేపింది. దీంతో ఇంఫాల్ నుంచి వెళ్లాల్సిన కొన్ని విమానాలను రద్దు చేయగా, ఇంఫాల్‌కు వచ్చే వాటిని దారి మళ్లించారు. శాంతి భద్రతల సమస్య కారణంగా రాష్ట్రంలో ఇంటర్నెట్ నిషేధాన్ని ఈ నెల 23 వరకు పొడిగించారు. ఈ నిర్ణయం తీసుకున్న వెంటనే యూఎఫ్‌వో కలకలం రేపడం గమనార్హం.

పాఠ్యాంశాల్లో వేదాలు!

న్యూఢిల్లీ: పాఠ్యాంశాల్లో వేదాలు, భారతీయ భాషలను ప్రవేశపెట్టే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నట్టు కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడించారు. శనివారం జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ ఈ ప్రాజెక్టుల కోసం వంద కోట్లను కేటాయిస్తున్నట్టు చెప్పారు. అలాగే వేదిక్ బోర్డులు నిర్వహిస్తున్న పదో తరగతి (వేద భూషణ్), 12వ తరగతి (వేద విభూషణ్) పరీక్షలు పూర్తి చేసిన విద్యార్థులు ఇక నుంచి ఇంజనీరింగ్, మెడిసిన్ సహా ఏ కాలేజీలోనైనా చేరేందుకు అర్హులని ఆయన వెల్లడించారు. అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ (ఏఐయూ) వేదిక విద్యను గుర్తించడానికి అంగీకరించడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు.

పంజరంలో చిలుకలా ఎన్నికల సంఘం

శివసేన (యూబీటీ) విమర్శ

ముంబై: భారత ఎన్నికల సంఘంపై శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఎన్నికల సంఘం పంజరంలో చిలుకలా మారిందని, అధికార బీజేపీకి అనుకూలంగా ద్వంద్వ ప్రమాణాలు అనుసరిస్తున్నదని విమర్శించారు. శివసేన పత్రిక సామ్నాలో ఆయన ఈ మేరకు విమర్శలు చేశారు. మధ్యప్రదేశ్‌లో తాము తిరిగి అధికారంలోకి వస్తే అయోధ్య రామాలయానికి ఉచితంగా టూర్లు నిర్వహిస్తామని కేంద్ర మంత్రి అమిత్ షా హామీ ఇచ్చారని, ఇది మత ప్రాతిపదికన ప్రచారం చేయడమేనన్నారు. అలాంటి ప్రకటన కాంగ్రెస్ నేత ఎవరైనా చేసుంటే ఈ పాటికి ఈసీ, ఈడీలు వారెంట్‌తో అతడి ఇంటి ముందు వాలేవన్నారు.

మనమే నం.1

ఉద్యోగ కల్పనలో

ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల భర్తీలో దేశంలోనే తెలంగాణ టాప్

తొమ్మిదిన్నరేండ్లలో 2,32,308 ప్రభుత్వ ఉద్యోగాలకు గ్రీన్ సిగ్నల్ • ప్రైవేటు రంగంలో మరో 22.5 లక్షలు.. మొత్తంగా 25 లక్షలు భర్తీ

కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో 10,080 సర్కారీ కొలువులే • బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో పెచ్చరిల్లుతున్న నిరుద్యోగిత రేటు

ప్రతి రెండు నిమిషాలకు ఓ ఉద్యోగం
అంటే గంటకు 30 ఉద్యోగాలు
ఇందులో మూడు ప్రభుత్వ కొలువులు..
మిగతా 27 ప్రైవేటు ఉద్యోగాలు
గడచిన తొమ్మిదిన్నరేండ్లలో
మొత్తం 25 లక్షల ఉద్యోగాల కల్పన
బీఆర్ఎస్ సర్కారు ట్రాక్ రికార్డు ఇది

పదేండ్లలో 10,080 ప్రభుత్వ ఉద్యోగాలు
సమైక్య రాష్ట్రంలో తెలంగాణకు
కాంగ్రెస్ ఇచ్చిన ప్రభుత్వ ఉద్యోగాలివి

మూడేండ్లలో 21 సర్కారీ కొలువులు
డబుల్ ఇంజిన్ బీజేపీ సర్కారు
ఉన్న మధ్యప్రదేశ్ ట్రాక్ రికార్డు ఇది.

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్ జలమండలిలో మేనేజర్లుగా నియమితులైనవారికి 08-04-2021న నియామక పత్రాలు అందజేస్తున్న మంత్రి కేటీఆర్

హైదరాబాద్, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ): ఏడాదికి రెండు కోట్ల చొప్పున ఉద్యోగాలు ఇస్తామన్న కేంద్రంలోని బీజేపీ, అధికారాన్ని అప్పగించిన ఆరు నెలల్లోనే ఖాళీలను భర్తీచేస్తామంటూ ఆర్భాటపు ప్రకటనలు చేస్తున్న కాంగ్రెస్ పాలనలోని రాష్ట్రాల్లో నిరుద్యోగిత రేటు ఆకాశాన్నంటుతున్నది. లక్షలాది మంది నిరుద్యోగులు డిగ్రీ పట్టాలు చేతబట్టి రోడ్లమీద తిరుగుతున్నారు. అయితే..నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించి అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ సర్కారు తొమ్మిదిన్నరేండ్లలోనే 2,32,308 ప్రభుత్వ ఉద్యోగాలకు అనుమతి ఇచ్చింది. అందులో నియామక సంస్థలు 27 శాఖల్లో 2,02,735 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఇచ్చాయి. ఇప్పటి వరకు 1,60,083 ఉద్యోగాల భర్తీ ప్రక్రియ పూర్తయింది. మరో 42,652 ఉద్యోగాల భర్తీ ప్రక్రియ కొనసాగుతున్నది. ప్రైవేటురంగంలో మరో 22.5 లక్షలకు పైగా ఉద్యోగకల్పన జరిగింది. అలా గడిచిన తొమ్మిదిన్నరేండ్లలో 25 లక్షల ఉద్యోగాల నిచ్చి దేశంలో అతితక్కువ సమయంలో ఎక్కువ ఉద్యోగాలు భర్తీ చేసిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. గత తొమ్మిదిన్నరేండ్ల సగటును పరిశీలిస్తే కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాలు ఉద్యోగకల్పనలో తెలంగాణ దరిదాపుల్లో కూడా లేకపోవడం గమనార్హం.

కాంగ్రెస్‌తో పోలిస్తే 23 రెట్లు ఎక్కువ

సమైక్య రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ 2004 నుంచి 2014 మధ్య 24,086 ప్రభుత్వ ఉద్యోగాలను మాత్రమే భర్తీచేసింది. ఇందులో తెలంగాణ పది జిల్లాల వాటా 42 శాతం అనుకుంటే.. దక్కినవి కేవలం 10,080 ఉద్యోగాలే. అదే.. తెలంగాణ ఏర్పడిన తర్వాత.. అంటే 2014 నుంచి 2023 వరకు రాష్ట్రంలో గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన ఉద్యోగాల సంఖ్య అక్షరాల 2,32,308. ఈ లెక్కన కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటితో పోలిస్తే తెలంగాణలో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు 23 రెట్లు ఎక్కువ ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసింది.

10.05 శాతానికి నిరుద్యోగిత రేటు

సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సీఎంఐఈ) తాజా నివేదిక ప్రకారం.. సెప్టెంబర్‌లో దేశంలో 7.09 శాతంగా ఉన్న నిరుద్యోగిత రేటు అక్టోబర్ నాటికి 10.05 శాతానికి ఎగబాకింది. గడిచిన రెండున్నరేండ్లలో కరోనా సంక్షోభం తర్వాత ఈ స్థాయిలో నిరుద్యోగిత రేటు పెరుగడం ఇదే తొలిసారి. గడిచిన నెలరోజుల వ్యవధిలో గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగిత రేటు 6.2 శాతం నుంచి ఏకంగా 10.82 శాతానికి పెరగ్గా, పట్టణాల్లో ఇదే సమయంలో 8.44 శాతానికి చేరింది. దేశంలోని మొత్తం శ్రామికవర్గంలో కేవలం 43 శాతం మందికే ఉద్యోగాలు ఉండగా, ఇప్పటికిప్పుడు అర్హతకు తగిన ఉద్యోగాలు కావాల్సినవారు 22 కోట్ల మంది వరకు ఉన్నట్టు నివేదికలు చెబుతున్నాయి. గత అక్టోబర్‌లో భారత మార్కెట్‌లోకి కొత్తగా కోటి మంది ఉద్యోగార్థులు చేరినట్టు సీఎంఐఈ తెలిపింది. కాగా, ఈ ఏడాది చివరినాటికి పది లక్షల ఉద్యోగాలు ఇస్తామంటూ ప్రధాని నరేంద్రమోదీ ఇటీవల ఆర్భాటంగా ప్రకటించారు. అయితే, ఆచరణలో మాత్రం అది జరుగడం లేదని సీఎంఐఈ తాజా నివేదికను బట్టి అర్థమవుతున్నది.

తొలి స్థానాల్లో బీజేపీ, కాంగ్రెస్ రాష్ట్రాలే

సీఎంఐఈ గణాంకాల ప్రకారం.. దేశంలో అత్యధిక నిరుద్యోగం ఉన్న రాష్ట్రాల్లో బీజేపీపాలిత హర్యానా (37.4 శాతం) తొలిస్థానంలో ఉండగా, రెండో స్థానంలో కాంగ్రెస్‌పాలిత రాజస్థాన్ (28.5 శాతం) నిలిచింది. రాజస్థాన్‌లో 18.4 లక్షల కంటే ఎక్కువ మంది నిరుద్యోగులు ఉన్నట్టు గత ఫిబ్రవరిలో అసెంబ్లీలో ప్రభుత్వమే ఒప్పుకొన్నది. 2018లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పరీక్షా పత్రాలు లీక్ కావడంవల్ల గెహ్లాట్ సర్కారు కనీసం 12 పరీక్షలను రద్దు చేసింది.

బీఆర్ఎస్ పాలనలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ఇలా

ఆర్థిక శాఖ అనుమతి ఇచ్చినవి **2,32,308**	నోటిఫికేషన్లు ఇచ్చినవి **2,02,735**
నియామక ప్రక్రియ పూర్తయినవి **1,60,083**	నియామక ప్రక్రియ కొనసాగుతున్నవి **42,652**
ప్రైవేటు రంగంలో కల్పించిన ఉద్యోగాలు **22.5** లక్షలు	మొత్తం ఇచ్చిన ఉద్యోగాలు దాదాపు **25** లక్షలు

ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ఇలా

అంశం	తెలంగాణ	కేంద్రంలోని బీజేపీ
జనాభా	4 కోట్లు	140 కోట్లు (దేశ జనాభా)
18-35 ఏండ్ల మధ్యవారు	1.4 కోట్లు	45 కోట్లు
తొమ్మిదిన్నరేండ్లలో భర్తీ చేసినవి	2.3 లక్షలు	6.9 లక్షలు
అర్హులైన లక్షమందికి లభించినవి	1,643	153

దేశంలో నిరుద్యోగిత శాతం



విశ్వ సుందరిగా షెన్నిస్ పలాసియోస్

న్యూఢిల్లీ, నవంబర్ 19: ప్రతిష్టాత్మక 2023 విశ్వ సుందరి కిరీటాన్ని నికరాగ్వా చిన్నది షెన్నిస్ పలాసియోస్ గెల్చుకుంది. 23 ఏండ్ల షెన్నిస్.. నికరాగ్వాలో ఆడియో విజువల్ నిర్మాత, మానసిక కార్యకర్తగా పనిచేస్తున్నారు. అంతర్జాతీయ అందాల పోటీలలో ఆ దేశానికిది మొదటి విజయం. శనివారం రాత్రి జరిగిన మిస్ యూనివర్స్ 72వ ఎడిషన్ పోటీలలో విజేతగా నిలిచిన షెన్నిస్‌కు అమెరికాకు చెందిన 2022 మిస్ యూనివర్స్ ఆర్.బన్నీ గాబ్రియేల్ కిరీటాన్ని అలంకరించారు. ఈ పోటీలలో మిస్ థాయ్‌లాండ్ అన్నటోనియా పోర్సిడ్ మొదటి రన్నరప్‌గా, మిస్ ఆస్ట్రేలియా మోరడా విల్సన్ రెండో రన్నరప్‌గా నిలిచారు. శాన్ సాల్వడర్ వేదికగా జరిగిన ఈ పోటీల్లో 84 మంది పోటీపడ్డారు. భారత్‌కు చెందిన మిస్ ఇండియా శ్వేత శారద కూడా పాల్గొని టాప్ 20లో నిలిచారు. అలాగే తొలిసారి పాకిస్థాన్ తరపున ఎరికా రాబిన్ పాల్గొన్నారు.

మరణించిన కొడుకు ఆస్తిపై తల్లికి హక్కు లేదు

- అసలైన వారసులు భార్య, పిల్లలే: మద్రాస్ హైకోర్టు

చెన్నై, నవంబర్ 19: మరణించిన కుమారుడి ఆస్తిపై తల్లికి ఎలాంటి హక్కు ఉండదని, భార్య, పిల్లలకు మాత్రమే ఆస్తిపై హక్కు ఉంటుందని మద్రాస్ హైకోర్టు సంచలన తీర్పును వెలువరించింది. 2012లో మరణించిన తన కుమారుడి ఆస్తిలో వాటా కావాలంటూ ఓ తల్లి దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన ద్విసభ్య ధర్మాసనం ఈ మేరకు తీర్పును వెలువరించింది. తమిళనాడులోని నాగపట్టణంకు చెందిన మోసెస్‌కు భార్య, ఒక కూతురు ఉన్నారు. 2012లో మోసెస్ మరణించటంతో ఆస్తిలో తనకు వాటా కావాలని, అతడి తల్లి మేరీ కోర్టును ఆశ్రయించారు. జిల్లా కోర్టు ఆమెకు అనుకూలంగా తీర్పు చెప్పగా, మోసెస్ భార్య మద్రాస్ హైకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేశారు. 'వారసత్వ చట్టం సెక్షన్ 42 ప్రకారం, మృతుడికి భార్యా పిల్లలు లేకపోతే.. అతడి తండ్రికి ఆస్తి చెందుతుంది. తండ్రిలేని సమయంలో తల్లి, సోదరులు, సోదరీమణులకు ఆస్తిపై హక్కు ఉంటుంది' అన్న న్యాయవాది వాదనతో ధర్మాసనం ఏకీభవించింది.

పంట నష్టానికి రూ.2 పరిహారం

- మహారాష్ట్ర రైతులకు వింత అనుభవం

ముంబై, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ): మహారాష్ట్రలోని యావత్మాల్ జిల్లా రైతులకు వింత అనుభవం ఎదురైంది. పంట నష్టానికి వచ్చిన రూ.2, రూ.3 పరిహారం చూసి అవాక్కవడం వారి వంతయింది. ఈ ఏడాది జూలైలో కురిసిన అధిక వర్షాలతో పంట నష్టపోయిన 59,404 మంది రైతుల ఖాతాల్లో పంటల బీమాకు సంబంధించి దాదాపు రూ.41.1 కోట్లు జమ అయినట్టు జిల్లా అధికారులు ఇటీవల ప్రకటించారు. దీంతో రైతులు బ్యాంకుకు వెళ్లగా.. తమ ఖాతాల్లో రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ జమ చేసిన డబ్బు చూసి అవాక్కయ్యారు. చాలా మంది ఖాతాల్లో రూ.2, రూ.3 పడ్డాయి. దీంతో ఇన్సూరెన్స్ కంపెనీ తమ నోట్లో మట్టి కొట్టిందని బాధిత రైతులు వాపోతున్నారు. వరజడి గ్రామానికి చెందిన మనోజ్ రాథోడ్ అనే రైతు ఖాతాలో రూ.2, అతని తమ్ముడు దేవానంద్ ఖాతాలో రూ.2, యావాలి గ్రామానికి చెందిన రైతు మెరా సింగ్ రమణ్ రాథోడ్ ఖాతాలో రూ.3, ఇంకా చాలా మంది ఖాతాల్లో ఇలాగే జమ చేసినట్టు ఉందని జిల్లా శివసేన అధ్యక్షుడు సంతోష్ ధవళే ఆరోపించారు. రైతుల పుండుపై ప్రభుత్వం కారం రాస్తున్నదని, దీనిని సహించేది లేదని హెచ్చరించారు. పంట నష్టంపై రీ సర్వే జరిపించి రైతులకు న్యాయం చేయాలని, లేకపోతే ఆందోళనలు చేస్తామని పేర్కొన్నారు. యావత్మాల్ జిల్లాలో జూలై నెలలో కురిసిన అతివృష్టి కారణంగా తమ పంట నష్టపోయినట్టు 5,25,541 రైతులు పంట బీమా పథకం కింద పరిహారానికి దరఖాస్తు చేసుకొన్నారు.

పుట్‌పాత్‌పై కరెంట్ తీగలు తాకి.. తల్లీబిడ్డ మృతి

- బెంగళూరులో అధికారులపై కేసు

బెంగళూరు, నవంబర్ 19: బెంగళూరు విద్యుత్తు పంపిణీ అధికారుల నిర్లక్ష్యానికి రెండు నిండు ప్రాణాలు బలయ్యాయి. పుట్‌పాత్‌పై నడుచుకుంటూ వెళ్తుండగా కిందపడి వున్న కరెంట్ తీగలు తగిలి తల్లి, ఆమె 9 నెలల బిడ్డ మృత్యువాత పడ్డారు. వైట్‌ఫీల్డ్‌లో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. సౌందర్య తన బిడ్డను వెంటబెట్టుకొని తల్లి ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. నగరంలోని పలుచోట్ల పుట్‌పాత్‌పై ఫైబర్ ఆప్టిక్ కేబుల్స్ పడినున్నాయని, కరెంట్ తీగలు తెగిపడ్డా.. వాటిని కూడా ఫైబర్ ఆప్టిక్ కేబుల్స్ అనుకోవటం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఓ పోలీస్ అధికారి చెప్పారు. 'బెస్కమ్' (బెంగళూరు విద్యుత్ పంపిణీ కంపెనీ) అధికారులపై పోలీసులు కేసులు నమోదు చేశారు.

సెబీపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలి

- అదానీ కేసు దర్యాప్తు ఆలస్యంపై సుప్రీంకోర్టులో పిటిషన్

న్యూఢిల్లీ, నవంబర్ 19: అదానీ-హిండెన్‌బర్గ్ కేసులో దర్యాప్తును పూర్తి చేయడంలో జరుగుతున్న ఆలస్యంపై సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా(సెబీ)కు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. దర్యాప్తు పూర్తి చేయడంలో, నివేదిక సమర్పించడంలో సుప్రీంకోర్టు పెట్టిన డెడ్‌లైన్‌ను సెబీ పాటించలేదని, సెబీపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలని పిటిషన్‌దారు విశాల్ తివారీ కోరారు. అదేవిధంగా అదానీ గ్రూపులో చోటుచేసుకొన్న అవకతవకలపై ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్టు(ఓసీసీఆర్పీ) తాజా నివేదికను కూడా ప్రస్తావించారు. మారిషస్ ఆధారిత అపారదర్శక ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్ ద్వారా అదానీ స్టాక్స్‌లలోకి మిలియన్ డాలర్లు పెట్టుబడులు వచ్చాయనన్న ఆరోపణలపై కూడా సెబీ కమిటీ దర్యాప్తు చేయాలన్నారు. అదానీ గ్రూపుపై హిండెన్‌బర్గ్ నివేదిక తర్వాత ఇన్వెస్టర్లు వేలాది కోట్ల రూపాయలు నష్టపోయారని న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు.

చిన్న పార్టీలతో చిక్కులు

- రాజస్థాన్‌లో కాంగ్రెస్, బీజేపీకి తలనొప్పి
- 68 అసెంబ్లీ స్థానాల్లో గెలుపోటములపై ప్రభావం

జైపూర్: రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు చిన్న పార్టీలు 68 స్థానాల్లో తలనొప్పిగా మారాయి. రాష్ట్రీయ లోక్‌తాంత్రిక్ పార్టీ, భారతీయ ఆదివాసీ పార్టీ, భారతీయ ట్రైబల్ పార్టీ, బీఎస్‌పీ, సీపీఎం, జననాయక్ జనతా పార్టీ, ఆజాద్ సమాజ్ పార్టీ వంటి 78 పార్టీలు గట్టి పోటీనిస్తున్నాయి. మరోవైపు 38 మంది రెబల్స్ స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారు. ఈ అభ్యర్థులు గెలవకపోయినా, తమ విజయావకాశాలను దెబ్బ తీస్తారని ఈ పెద్ద పార్టీలు తలపట్టుకుంటున్నాయి. 1993 నుంచి పరిశీలించినపుడు ఈ చిన్న పార్టీలు, స్వతంత్రులు దాదాపు 20 శాతం ఓట్లను సాధిస్తున్నారు.

ఆర్ఎల్‌పీ: ఆర్ఎల్‌పీ చీఫ్, నాగౌర్ ఎంపీ హనుమాన్ బేణీవాల్ ఈ ఎన్నికల్లో తనతో పాటు 81 స్థానాల్లో అభ్యర్థులను నిలిపారు. ఖిన్‌స్వర్, మెర్తా, భోపాల్‌గఢ్, పర్బత్సర్, మసుదా, బేటూ, అసింద్, చోము, కోలాయట్-సివానా నియోజకవర్గాల్లో కాంగ్రెస్, బీజేపీలకు ఈ పార్టీ పోటీనిస్తున్నది. 2018 ఎన్నికల్లో ఈ పార్టీ అభ్యర్థులు మూడు స్థానాల్లో గెలిచారు.

బీఏపీ: భారతీయ ఆదివాసీ పార్టీ గత ఎన్నికల్లో రెండు శాసన సభ స్థానాల్లో గెలిచింది. దుంగార్‌పూర్, బన్‌స్వారా జిల్లాల్లో బీటీపీ ఓటింగ్ సరళిని ప్రభావితం చేయగలదని విశ్లేషకులు చెప్తున్నారు. చోరాసీ, సగ్వారా, ఆస్‌పూర్, ఘటోల్, ధరియావాడ్, ప్రతాప్‌గఢ్, ఉదయ్‌పూర్ (గ్రామీణ), సలుంబర్, ఖేద్వారాలలో తాము బలంగా ఉన్నామని బీఏపీ చెప్తున్నది.

బీఎస్పీ: బీఎస్‌పీ ఈసారి 185 స్థానాల నుంచి పోటీ చేస్తోంది. 2018 ఎన్నికల్లో 190 స్థానాల నుంచి పోటీ చేసి, ఆరు నియోజకవర్గాల్లో గెలిచి, 4.03 శాతం ఓట్లను సాధించింది. కాంగ్రెస్, బీజేపీ తర్వాత మూడో అతిపెద్ద పార్టీగా నిలిచింది. ప్రస్తుతం తూర్పు రాజస్థాన్, ఎస్‌సీ ప్రాబల్యంగల నియోజకవర్గాల్లో తమకు గట్టి పట్టు ఉందని బీఎస్‌పీ వర్గాలు చెప్తున్నాయి.

సీపీఎం: సీపీఎం 17 స్థానాల్లో పోటీ చేస్తున్నది. కనీసం నాలుగు స్థానాల్లో కాంగ్రెస్, బీజేపీలకు దీటుగా నిలుస్తున్నది. 2018 ఎన్నికల్లో సీపీఎంకు రెండు స్థానాలు లభించాయి. హర్యానా ఉప ముఖ్యమంత్రి దుష్యంత్ చౌతాలా నేతృత్వంలోని జేజేపీ 20 మంది అభ్యర్థులను బరిలో నిలిపింది. మూడింటిలో బలంగా కనిపిస్తున్నది. బీజేపీ రెబల్ అభ్యర్థి రఘుబీర్ సింగ్ తన్వర్‌ను ఆకర్షించి, ఓ నియోజకవర్గం నుంచి పోటీ చేయిస్తున్నది.

స్వతంత్రులు: స్వతంత్ర అభ్యర్థులు 38 నియోజకవర్గాల్లో కాంగ్రెస్, బీజేపీలకు ఇబ్బందికరంగా మారారు.



డిప్రెషన్‌ను గుర్తించే రక్త పరీక్ష

న్యూఢిల్లీ, నవంబర్ 19: ప్రతికూల ఆలోచనలు, నిరంతరం విచారంలో వుండటం..'డిప్రెషన్' ముఖ్య లక్షణాలు. దీనిబారిన పడ్డ టీనేజర్స్ రక్తంలోని జీవకణాలు ప్రత్యేక లక్షణాల్ని కలిగి ఉన్నాయని, సాధారణమైన రక్త పరీక్షతో దీనిని ముందుగానే గుర్తించవచ్చునని తాజా అధ్యయనం వెల్లడించింది. రక్తంలోని 9 రకాల మైక్రోఆర్ఎన్ఏ జీవకణాలకు డిప్రెషన్‌కు సంబంధం ఉందని, టీనేజ్ యువతీ యువకుల మెదడు అభివృద్ధిపై దీని ప్రభావం పడుతున్నదని సైంటిస్టు సిసిలా ఫ్లోరెస్ అన్నారు. రక్త నమూనాలు సేకరించిన 9 నెలల తర్వాత డిప్రెషన్‌కు కారణమైన మైక్రోఆర్ఎన్ఏల సంఖ్య రక్తంలో పెద్ద ఎత్తున పెరుగుతున్నదని సైంటిస్టులు తమ అధ్యయనంలో కనుగొన్నారు.

ప్రెగ్నెన్సీలో ఒత్తిడి.. పిల్లలపై ప్రభావం

న్యూఢిల్లీ, నవంబర్ 19: గర్భంతో ఉండగా తల్లులు ఒత్తిడి, ఆందోళనకు గురైతే.. పుట్టబోయే పిల్లల ప్రవర్తనపై ప్రభావం పడుతుందని తాజా అధ్యయనం ఒకటి పేర్కొన్నది. 'ప్రెగ్నెన్సీ సమయంలో తల్లుల మానసిక ఆరోగ్యంపై దృష్టి సారించాలి. వారికి తగిన మద్దతు ఇవ్వటమన్నది అత్యంత కీలకం. అప్పుడు పుట్టబోయే పిల్లల మానసిక ప్రవర్తనలో సమస్యలు తలెత్తవు' అని కాలిఫోర్నియా స్టేట్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఇరిని టంగ్ చెప్పారు. ఈ అంశానికి సంబంధించి 55 రకాల అధ్యయనంలోని గణాంకాల్ని పరిశోధకులు విశ్లేషించారు.

పురుగు మందుల వల్ల తగ్గుతున్న వీర్య కణాలు!

న్యూఢిల్లీ: పురుగు మందుల ప్రభావంతో మగవారిలో వీర్య కణాల సంఖ్య తగ్గిపోతున్నదని ఎన్విరాన్‌మెంటల్ హెల్త్ పర్‌స్పెక్టివ్స్ జర్నల్‌లో ప్రచురితమైన తాజా అధ్యయనం వెల్లడించింది. గత 50 ఏండ్లలో ప్రపంచవ్యాప్తంగా ఒక మిల్లీలీటర్ వీర్యంలో ఉండే కణాల సంఖ్య 50% తగ్గిపోయిందని పరిశోధకులు మెలిస్సా పెర్రీ వెల్లడించారు. ఇండ్లు, ఉద్యానవనాలు, ఆహారం మీద చల్లే ఆర్గానో ఫాస్ఫేట్స్, ఎన్-మిథైల్ కార్బమేట్స్ వల్ల ఈ పరిస్థితి తలెత్తిందని ఆమె తెలిపారు. ఈ పురుగు మందులు సంతానోత్పత్తిపై ప్రభావం చూపిస్తాయని డాక్టర్ అలెగ్జాండర్ పాస్టుస్‌జాక్ తెలిపారు. వ్యవసాయ రంగంలో పనిచేసేవారు ఈ పురుగు మందుల ప్రభావానికి ఎక్కువగా గురవుతారని వెల్లడించారు.

ప్రపంచ సగటు కంటే రెట్టింపు

భారత్‌లో సైబర్ నేరాలు అధికం

బెంగళూరు: ప్రపంచ సగటు కంటే రెట్టింపు స్థాయిలో భారత్‌లో సైబర్ నేరాలు జరుగుతున్నాయని జాతీయ సైబర్ సెక్యూరిటీ కోఆర్డినేటర్ ఎం యూ నాయర్ ఆదివారం పేర్కొన్నారు. ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాన్సమ్‌వేర్ సైబర్ దాడుల్లో గత 10 నెలల్లో సగటున దాదాపు రూ.12,800 కోట్ల మేర సైబర్ నేరగాళ్లు కొల్లగొట్టారని, ఇది 2022 నుంచి రెట్టింపు అయిందన్నారు. భారత్‌లో గత ఆరు నెలలుగా సగటున 2,127 సైబర్ ఘటనలు జరిగాయని, ఇది ప్రపంచ సగటు 1,108 కంటే రెట్టింపు అని తెలిపారు.